# పబ్‌లలో "గలీజ్" దందా ..!

-కోరుకున్న సౌకర్యాలు.. అడ్డగోలు రేట్లు
-కస్టమర్లను ఆకర్షించేందుకు చట్టవ్యతిరేక పనులు
-పలు పబ్‌లలో అమ్మాయిలకు ఉచిత ప్రవేశం
-మందుబాబులతో కట్టించే బిల్లు ఆధారంగా కమిషన్లు
-తాజాగా బయటపడ్డ టాస్‌పబ్ "అశ్లీల నృత్యాలు"
-పోలీసుల అదుపులో 142 మంది యువతీ యువకులు



**హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** నగరంలో పబ్బు..గబ్బు సంస్కృతి రోజురోజుకి పెరిగిపోతూనే ఉంది. ధనార్జనే ధ్యేయంగా నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా పబ్‌లను నిర్వహిస్తున్నారు. వీకెండ్ వచ్చిందంటే చాలు నగరంలోని ఖరీదైన ప్రాంతాలుగా గుర్తింపు పొందిన జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, బేగంపేట్, గచ్చిబౌలి ప్రాంతాల్లో పదుల సంఖ్యలో జనాలు గుమిగూడటమే కాకుండా, పబ్ పరిసర ప్రాంతాలు పూర్తిగా రద్దీగా మారిపోతుంటాయి. పబ్‌లముందు అంతా ఇంత ఉండదు. పబ్‌లకు వచ్చేకస్టమర్లకు నిర్వాహకులు అన్ని సర్వీసులు అందిస్తున్నారు. కస్టమర్లు కోరుకుందే తడువుగా వారికి ప్రత్యేక గదులు కేటాయించడంతో పాటు హుక్కా, నుండి మొదలు, డ్రగ్స్ వరకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారు. అడపాదడపా దాడులు నిర్వహించే ఎక్సైజ్ అధికారులు నోటీసుల ఇచ్చి సరిపెట్టుకుంటున్నారు. ఒక మాఫియాలా తయారైన పబ్ నిర్వాహకులు, నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. పబ్‌ను నిర్వహించాలంటే పలు నిబంధనలు ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. అందులో పోలీస్, ఎక్సైజ్ నిబంధనలు పాటించక పోతే అంతే సంగతులు. ఇది అందరికీ తెలిసిన విషయమే అయినప్పటికీ నిబంధనలను తమకు పట్టవన్నట్టుగా నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా మైనర్లను అనుమతి నుండి మొదలు కొని తెల్లవారే వరకు పబ్‌లను నిర్వహిస్తున్నారు. అంతేకాదు సరఫరా చేసే మద్యానికి ఎలాంటి నిర్ణయించిన ధరల పట్టిక లేకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. ఇక ప్రేమ జంటలకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేస్తూ వారికి పూర్తి స్వేచ్ఛను కల్పిస్తున్నారు.

**పోలీసుల అదుపులో 142 మంది..**


యువతను గబ్బు పట్టిస్తున్న పబ్బులు కస్టమర్లను ఆకర్షించేందుకు అక్రమార్గాలు అనుసరిస్తున్నాయి. యువతలో అసభ్యకరమైన డ్యాన్సులు వేయిస్తూ తమ పబ్బుకు ఒకసారి వచ్చినవారిని మళ్ళీ వచ్చేలా చేస్తున్నాయి. ఈనేపథ్యంలో బంజారాహిల్స్ లోని ఓపబ్‌పై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. రోడ్‌నెంబర్ 4లోని టాస్‌పబ్‌లో తనిఖీలు చేయగా నిబంధనలకు విరుద్దంగా నిర్వాహకులు యువతులతో అసభ్యకర నృత్యాలు చేయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో 100మంది పురుషులు, 42మంది యువతులను అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**యువతులకు ఫ్రీఎంట్రీ...**

పబ్‌లలో కసమర్లను ఆకర్షించేందుకు ఫ్యాన్సీ డ్రెస్ వేసుకున్న యువతులకు కొన్నిపబ్‌లు ఫ్రీఎంట్రీ ఇస్తున్నాయి. పబ్‌లకు వచ్చే కస్టమర్ల నుంచి దండుకోవడానికి ఇదోప్రయత్నమని తెలుస్తుంది. ఆయువతకుల ద్వారా యువకులకు గాలం వేసి.. యువతులు చేసే ఖర్చును కూడా యువకుల నుంచి వసూలు చేస్తునా న్నరు. దీనికోసం ప్రత్యేకంగా యువతులకు ఆఫర్లు ప్రకటించడంతోపాటు యువకులతో డ్యాన్సులు చేస్తే వసూలు చేసే ఫీజులో వాటా ఇస్తున్నారు. దీంతో పబ్‌లకు ఏకాంతంగా వచ్చే యువతుల సంఖ్యకూడా పెరుగుతోందని సమాచారం. ఇక్కడి నుంచి చట్టవ్యతిరేఖ కార్యకలాపాలు జరిగేందుకు ఆస్కారమేర్పడుతోందని మరోవాదన. తాగిన మైకంలో యువతీయువలకు విచ్చలవిడిగా ప్రవర్తిచడంమే కాకుండా, హద్దు మీరుతున్నారనే ఆరోపణలు వినిపిస్తునా న్నయి. కొంతమంది పబ్ యజమానులు యువతులను ట్రాప్‌చేసి వ్యభిచారం వైపు మళ్ళిస్తునా న్నరని..దానికోసం అధిక మొత్తంలో కష్టమర్లనుచి డబ్బులు వసూలు చేస్తూ దందా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ఆప్రాంతాల్లోనే ఎక్కువ..**

నగరంలోని జూబ్లీహిల్స్, బంజావారాహిల్స్‌లతో పాటు పంజాగుట్ట ప్రాంతాల్లో 45వరకు పబ్‌లు ఉన్నాయి. ఒక్కజూబ్లీ హిల్స్‌లోనే 30పబ్బులు నడుస్తున్నాయి. వీటిపై ఇప్పటికే అనేక ఉల్లంఘన కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఏరీతితో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఖరీదైన పబ్బుగా పేరొ ందినవాటి నుండి మామూలు పబ్‌లపైన దాదాపు పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. మైనర్లను అనుమతించటం, అర్ధరాత్రి వరకు పబ్‌లు తెరిచిఉంచడం, హుక్కాతో పాటు, డ్రగ్స సరఫరా చేసినందుకుగాను వీటిపై కేసులు నమోదయ్యాయి. అయినా పబ్‌నిర్వాహకులు మాత్రం తమను ఎవరూ ఏమి చేయలేరన్న చందంగా వ్యవహరిస్తున్నారు. అయితేపబ్‌ల అడ్డగోలు బాగోతంపై చర్యలు తీసుకోవాల్సి న అధికారులు ఏమాత్రం ముందుకు రావడంలేదు. కేవలం మీడియాలో వచ్చిన కథనాలతో పాటు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్న సమయంలో మాత్రమే తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నోటీసులు ఇవ్వడం ఆతర్వాత ఉల్లంఘించిన మేరకు 15రోజుల నుండి మొదలు ఆరు నెలల వరకు పబ్‌ల లైసెన్స్‌రద్దుచేసే అధికారం ఆబ్కారీ అధికారులకు ఉంటుంది. కానీ ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా వెనకుడగు వేస్తున్నారు. పబ్‌లపై చర ్యలు తీసుకునే సదరు అధికా రులపై రాజకీయ నేతల ఒత్తిడి కూడా పెరిగి పోతుందని తెలుస్తోంది.



# హైదరాబాద్ వార్త

# తూకం..మోసం

-నిండా మునుగుతున్న వినియోగదారులు
-సాధారణ కాంటా, ఎలక్ట్రానిక్ మెషిన్లలోనూ చేతివాటం
-వీధి వ్యాపారాల నుంచి మాంసం,చేపల మార్కెట్ల వరకు మోసాలు

**హైదరాబాద్, అక్టోబరు 19 ప్రభాతవార్త**

ఉప్పల్‌కు చెందిన బుర్రా వెంకటేశ్వర్లు సమీపంలోని ఓ కిరాణాషాపునకు వెళ్లి కిలో కంది పప్పు, అరకిలో చింతపండు, లీటర్ వంట నూనె ప్యాకెట్ కొనుగోలు చేశాడు. కంది పప్పు, చింత పండును ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషిన్‌పై తూచి ఇవ్వడంతో కరెక్టుగానే ఉంటుందని భావించాడు. ఇంటికొచ్చాక అనుమానం రావడంతో తూకం వేసి చూశాడు. కందిపప్పు 950 గ్రాములు,చింత పండు 450 గ్రాములే ఉండడంతో అవాక్కయ్యాడు. ఇక ప్యాకింగ్ చేసిన లీటర్ నూనె ప్యాకెట్ కూడా 870 మిల్లీలీటర్లే ఉండడంతో మోసపోయానని గ్రహించాడు. ఇలా ఒక బుర్రా వెంకటేశ్వర్లనే కాదు..ఎంతో మంది నగరవాసులు దోపిడికి గురవుతున్నారు. నగరంలో చిన్న కిరాణషాపు నుంచి సూపర్‌మార్కెట్ల వరకు తూకంలో చేతివాటం ప్రదర్శిస్తుండడంతో వినియోగదారులు మోసపోతున్నారు. బియ్యం, ఉప్పు, పప్పు, కూరగాయలు, పండ్లు, మాంసం..ఇలా ఏది కొనుగోలు చేసినా కిలోకు 900-950 గ్రాములే వస్తోంది. ఇక లీటర్లలో కొనుగోలు చేసి వస్తువులైతే లీటర్‌కు 800-850 మిల్లీలీటర్లే వస్తున్నాయి. సాధారణ కాంటాతో పాటు ఎలక్ట్రానిక్ మెషిన్లలో సెట్టింగ్‌లు చేస్తూ వ్యాపారులు ఈ మోసాలకు పాల్పడుతున్నారు. చట్టాల్లోని లొసుగులే ఆసరాగా దోపిడీ చేస్తూ తప్పించుకుంటున్నారు. వీటన్నింటినీ అరికట్టాల్సి న తూనికలు, కొలతల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. గ్రేటర్‌లో పెద్ద, చిన్నా చితకా వ్యాపార సంస్థలన్నీ కలిపి సుమారు 4లక్షలకు పైగానే ఉంటాయి. వీటిలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి, మోసాలను అరికట్టాల్సి న బాధ్యత తూనికలు, కొలతల శాఖ అధికారులపై ఉంది. అయితే వారు నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ జరిమానాలు వేస్తున్నారు. తూకాల్లో మోసం, నిబంధనల ఉల్లంఘనలపై అధికారులు మొదటిసారి జరిమానా విధిస్తారు. అదే తప్పు తిరిగి చేస్తే కేసు నమోదు చేసి కోర్టుకు సిఫార్సు చేస్తారు. కోర్టు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. అయితే కోర్టు జైలు శిక్ష విధించిన కేసులు పెద్దగా లేనట్లు తెలుస్తోంది. తక్కువ తూకం వేస్తే తూనికలు, కొలతల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ 2009 యాక్ట్ సెక్షన్ 30 ప్రకారం కనీసం రూ.1000 నుంచి రూ.10వేల వరకు జరిమానా విధిస్తారు. ప్యాకేజీ కమోడిటీ యాక్ట 30 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించే వారికి రూ.2వేల నుంచి రూ.25వేల వరకు జరిమానా వేస్తారు. ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషిన్‌లో మొత్తం నాలుగు ఆప్షన్లు ఉంటాయి. ఇందులో ఒకదాని సహాయంతో వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారు. కిలోకు 50-100 గ్రాములు తక్కువగా ఉండేలా సెట్ చేస్తున్నారు. అప్పుడు ఆ ఆప్షన్ నొక్కి మెషిన్‌పై 900-950 గ్రాముల బరువు ఉంచితే అది 1000గ్రాములు (కిలో)గా డిస్‌ప్లే అవుతుంది.అంటే కిలోకు 50 నుండి 150 గ్రాముల వరకు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. మెషిన్‌లోని మరో ఆప్షన్‌ను నొక్కితే తూకం సక్రమంగా వస్తుంది. అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు సరైనా ఆప్షన్‌తో తూకం వేస్తూ వ్యాపారులు బోల్తా కొట్టిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు బయటపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. మార్కెట్‌లో లభించే వివిధ బ్రాండ్ల నూనె ప్యాకెట్లు కూడా నిర్దేశించిన బరువు కంటే తక్కువగా ఉంటున్నాయి. లీటర్ ప్యాకేజ్డ్ నూనె నిబంధనల ప్రకారం ప్యాకెట్‌లో 910 మిల్లీలీటర్లు ఉండాలి. కానీ కొని న్న ప్యాకేజ్డ్‌లో 800-850 గ్రాములు మించడం లేదు. ఇక ఐదు లీటర్ల ప్యాకేజ్డ్ బాటిల్‌లో 200-280 గ్రాములు, 15 లీటర్ల ప్యాకేజ్డ్ బాటిల్‌లో 250-300 మిల్లీలీటర్లు తక్కువగా ఉంటోందని వినియోగదారులు పేర్కొంటున్నారు. తక్కువ తూకం గల ప్యాకింగ్‌లు సైతం తూనికలు, కొలతల శాఖ దాడుల్లో బయట పడమే ఇందుకు నిదర్శనం నగరంలోని పెద్ద పెద్ద దుకాణాల్లో మినహా మిగతా వాటిలో సాధా రణంగా 24 క్యారెట్ల కంటే తక్కువ నాణ్యత కలిగిన బంగారాన్నే విక్రయిస్తుంటారు. వజ్రాల నగ కేవలం 18 క్యారెట్ల బంగారంతో మాత్రమే ఉంటుంది. కొందరు వ్యాపారులు 18 క్యారెట్ల ఆభరణాన్ని వినియోగదారులకు విక్రయించి 22 క్యారెట్లకు బిల్లు వసూలు చేస్తున్నారు. 22 క్యారె ట్లు, 18 క్యారెట్ల ఆభరణానికి మధ్య గ్రాముకు కనీసం రూ.500 నుంచి రూ.700 వరకు తేడా ఉంటుంది. ఈ లెక్కల కనీసం 10 గ్రాములకు రూ.5వేల నుంచి రూ.7వేల వరకు నష్టం తప్ప దు. బంగారం తూచే ఎలక్ట్రానిక్ కాంటాల వెనుక త్రాసును నియంత్రించే వీల్స్ బేరింగ్‌లను మార్చు చేసే అవకాశం ఉంటుంది. బంగారం నాణ్యతను తెలిపే మెషిన్ లేకపోవడంతో వినియోగదారులు మోసాలకు గురవుతున్నారు.

## అది పులికాదు.. అడవిపిల్లే...

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 19 ప్రభాతవార్త**

మియాపూర్‌లో మెట్రోస్టేషన్ సమీపంలో చిరుత కలకలం సుఖాంతమైంది. అది పులికాదు.. అడవిపల్లి అంటూ ఆటవిశాఖ అధికారులు తేల్చేశారు. చిరుతను పోలిన జంతువు మియాపూర్‌లోలో కనిపించటం సంచలనంగా మారిన విషయం విదితమే. మెట్రోస్టేషన్ సమీపంలో చిరుత సంచారం అంటూ ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అటుగా వెళ్తున్న చిరుతను పోలిన జంతువు వీడియోను రికార్డు చేసిన యువకులు దానిన సోషల్ మీడియాలో షేర్ చేయటంతో వైరల్‌గా మారింది. దీంతో రంగంలోనికి దిగిన అటవీశాఖ అదికారులు అనుమానాస్పదంగా తిరుగుతున్న జంతువు సంచారంపై కీలక సమాచారం ఇచ్చారు. నగరం మద్యలో చిరుత సంచారం వ్తా తెలిసి సమీప కాలనీల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు వెంటనే రంగంలోనికి దిగిన పోలీసులు, అటవీ శాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. స్థానికులను అప్రమత్తం చేశారు. ఒంటరిగా రాత్రి సమయంలో బయట తిరుగవద్దని పోలీసులు సూచించారు. అనంతరం వీడియోలో కనిపించిన జంతువు ఆనవాళ్లపై అధికారులు ఆరా తీశారు. ఫారెస్ట్ అధికారుల విచారణలో చివరకు అది చిరుత కాదని తేలింది. అక్కడ అడవిపిల్లి సంచరించిందని, దాన్ని చిరుతగా భావించి కొందరు వీడియో తీసినట్లు అధికారులు గుర్తించారు. ఆ వీడియోలోని జంతువు కదలికలను బట్టి, వాటి అడుగులను బట్టి అది అడవి పిల్లిగా నిర్ధారించారు. సమీప కాలనీల ప్రజలు భయపడ్డాల్సిన పనిలేదని, చిరుత సంచరించేందుకు మియాపూర్‌లో అనువైన ప్రదేశం లేదని అటవి శాఖ అధికారులు ప్రకటన వెల్లడించటంతో సమీపంలోని కాలనీల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

**అది చిరుతకాదు : డీఎఫ్ఓ విజయానందరావు**

మియాపూర్ మెట్రోస్టేషన్ సమీపంలో కనిపించింది చిరుత కాదని శంషాబాద్ డీఎఫ్ఓ విజయానందరావు తేల్చిచెప్పారు అది అడవిపులి మాత్రమేనని ఆయన వెల్లడించారు.ఆ ప్రాంతాలను పరిశీలించినప్పుడు కాలి ముద్రలు 3.5 సెంటీమీటర్లు మాత్రమే ఉందని చెప్పారు.చిరుతపులి ముద్రలయితే కనీసం 7సెంటీమీటర్లు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.సెల్‌ఫోన్‌లో జూమ్‌చేసి వీడియో తీయటం వల్ల అది చిరుత పులి లాగా కనిపించిందని ఆయన తెలిపారు.ప్రజలు భయపడాల్సి న పనిలేదని పేర్కొన్నారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో మోసం

### నకిలీ ఆఫర్ లెటర్‌లతో బురిడీ...

**పంజగుట్ట, అక్టోబర్ 19 (ప్రభాతవార్త):**

నగరంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేస్తున్న భార్యాభర్తలపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసునమోదు చేశారు. వివరాల ప్రకారం..ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురి వద్దనుండి 26 లక్షల రూపాయలు వసూలు చేశారు. ఆ తర్వాత ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో మోసపోయామని గ్రహించిన వారు పోలీసులను ఆశ్రయించారు. జూబ్లీహిల్స్ ప్రవంతినగర్‌లో నివశించే వాసు టీసీఎస్‌లో ఉద్యోగి.ఆయనకు అదేసంస్థలో పనిచేసే శ్రీరాంకిరణ్ పరిచయమయ్యాడు. తనకు వివిధ సాఫ్ట్‌వేర్ సంస్థలతో మంచి పరిచయాలున్నాయని,ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వాసుకు తెలిపాడు. ఇదినమ్మిన వాసు తనకు తెలిసిన 17 మందిని అతడివద్దకు తీసుకువెళ్ళాడు.ఐబీఎం సంస్థలో ఉద్యోగాల కోసం వీరు శ్రీరాంకిరణ్ భార్య సంధ్యారాణి ఖతాల్లోకి ఫిబ్రవరిలో 26 లక్షల రేపాయలు పంపించారు, అనంతరం 17 మందికి ఉద్యోగాలు వచ్చినట్లు ఆఫర్ లెటర్లు ఇచ్చారు. దీంతో ఉద్యోగంలో చేరడానికి భ్యర్థులు వెళ్ళగా అవి నకిలీ అని తేలింది. దీంతో వా సంప్రదించగా మరో సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఆ తర్వాత భార్యాభర్తలు, వాసు సెల్‌ఫోన్ పనిచేయలేదు. ఎంతకీ వీరి ఆచూకీ తెలియక పోవడంతో బాధితులు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు....

## బంజారాహిల్స్‌లో పబ్‌పై దాడి...

### ఆశ్లీల నృత్యాలు చేస్తున్న యువత అరెస్ట్..

**పంజగుట్ట, అక్టోబర్ 19 ప్రభాతవార్త:** బంజారాహిల్స్‌లో ఓ పబ్‌పై దాడి చేసిన పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై కేసునమోదు చేశారు. వివరాల ప్రకారం బంజారాహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలోని టాస్ పబ్‌పై టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి చేశారు. 42 మంది యువతులతో అసాంఘిక నృత్యాలు చేయించడంతో పోలీసులు అక్కడున్న 142 మందిని అదుపులోకి తీసుకున్నారు. పబ్‌లో కస్టమర్లను ఆకర్షించేందుకు వివిధ రాష్ట్రాల నుండి యువతులను రప్పించి వారితో అసభ్యకర నృత్యాలు చేయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. పట్టుబడిన వారికి పోలీసులు డ్రగ్స్ పరిక్షలు నిర్వహించి నిర్వాహకులపై కేసునమోదు చేశారు. ఎన్నిదాడులు చేస్తున్నా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాలలో పబ్‌ల నిర్వాహకుల తీరులో మార్పురావడం లేదని స్థానిక పోలీసులు అంతర్గత సంభాషణలలో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగర పోలీసు కమీషనర్ ఈ విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.


## రమణీయం రసభరితం కూచిపూడి నృత్య ప్రదర్శన



రితిక కూచిపూడి నృత్యప్రదర్శనలో దృశ్యాలు

**రవీంద్రభారతి, అక్టోబరు 19 ప్రభాతవార్త :** ప్రముఖ సాంస్కృతిక సంస్థ కందుల కూచిపూడి నాట్యాలయం ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో శనివారం రాత్రి గురు రవి కూచిపూడి శిష్యురాలు కె.రఘురామ్ చంద్రరావు, శైలజల తనయ కంబలదిన్నె రితిక కూచిపూడి రంగప్రవేశం శృతి లయ తాళ సమ్మిళితంగా రమణీయం, రసభరితంగాసాగి విచ్చేసిన అశేష ప్రేక్షకులను తన్మయుల్ని చేసింది. గురు జి.రవి వద్ద 2011లో నాట్యశిక్షణ ప్రారంభించి ఆయనతో కలిసి అనేక జాతీయస్థాయి ప్రదర్శనల్లో పాల్గొని మెప్పించి ప్రశంసలందుకుంది. రితిక బిటెక్ చివరి సంవత్సరం చదువుతూ నృత్యంతోపాటు క్రీడలు, ఆర్ట్సలలో రాణించడం విశేషం. రితిక తన రంగప్రవేశాన్ని విఘ్నాలు కలుగకుండా హంసధ్వనిరాగం ఆదితాళంలో గణపతిని గజవదన బేడువే అని స్తుతిస్తూ ప్రదర్శనను ప్రారంభించి శివస్తుతి, స్తుతి కంజదళయతాక్షి అంటూ అమ్మవారిని కీర్తిస్తూ ప్రదర్శించి నాట్యాంశాలు అద్భుతం అపూర్వం. కృష్ణ నే బేగనే బారో, జావళి అభినయం ప్రధాన అంశాలను, భామాకలాపం, నారాయణతీర్థుల తరంగం అంశాలను తన నృత్యాభినయ మిళితంతో కనువిందుచేసి మంత్రముగ్ధులను కావించింది. గురు రవి నట్టువాంగం, ఐ.స్వేతప్రసాద్ గాత్రం, ఐ.వి.రేణుకప్రసాద్ మృదంగం, కె.చందర్‌రావు వయోలిన్, ఉమావెంకటేశ్వర్లు వేణువులతో అద్భుత వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. అతిథులుగా పాల్గొన్న గురువు వేదాంతం నరసింహశాస్త్రి, డా. వెంకట సుబ్రహ్మణ్యం, కోక విజయలక్ష్మి, కె.లక్ష్మీనారాయణ ఆచార్య తదితరులు కళాకారిణి రతికను ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపి భవిష్యత్తులో అత్యుత్తమ నృత్యకళాకారిణిగా పేరొందాలని ఆశీస్సులందించారు.

## అంబర్‌పేటలో వృద్ధ దంపతుల దారుణహత్య



**హైదరాబాద్,అక్టోబరు 19 ప్రభాతవార్త**

అంబర్‌పేట,సాయిబాబానగర్ కాలనీలో వృద్ధ దంపతులు దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. మూడంతస్తుల భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటున్న వృద్ధ దంపతులు లింగారెడ్డి, ఊర్మిళాదేవిని గుర్తు తెలియని దుండగులు దారుణంగా హత్య చేశారు. తలపై బాది, గొంతు కోసి కిరాతకంగా హతమార్చినట్లు పోలీసులు గుర్తించారు. దొంగతనానికి వచ్చిన దుండగులే దంపతులను హత్య చేసి ఉంటారని, మూడు రోజుల క్రితం ఘటన జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

## మూసి పేరుతో ప్రజాధనం లూటీ : కెటిఆర్

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 19 ప్రభాతవార్త:**

మూసి ప్రక్షాళన పేరుతో ప్రజాధనాన్ని ద్యూటీ చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పథకం రూపొందించారని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రూ.25 వేలకోట్లతో మొత్తం మూసి పునర్జీవం అవుతుందనే అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించడం వల్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని నాగోల్ ఎస్టిపిసిని టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి శనివారం కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలోని కాంగ్రెస్కు మోటారు మోయడానికి రేవంత్ రెడ్డి దిరికాడని ఎద్దేవ చేశారు. హైదరాబాద్ తో బిల్డర్ బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరభించారు. మూసి బఫర్ జోన్ లో ఉన్న వాళ్లను కబ్జాదారులని రేవంత్ ముద్రవేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోనే అతిపెద్ద మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని నాగోల్ లో నిర్మించామని ఇక్కడ శుద్ధిచేసిన నీళ్లు నల్లగొండ జిల్లాకు వెళ్తున్నాయని తెలిపారు. రేవంత్ రెడ్డి కొత్తగా చేసేదేం లేదని అన్నారు. ఎస్ టి పి లను సక్రమంగా నడుపుకుంటే చాలని సలహా ఇచ్చారు. మూసినది హైదరాబాదుకు ఒక వరమనే దానిని మురికి కోపంగా మార్చింది కాంగ్రెస్ టిడిపి ప్రబుత్వాలేనని ఆరభించారు. హైదరాబాదులో రోజు 20 కోట్ల లీటర్ల మురికి నీరు ఉత్పత్తి అవుతుందన్నారు. దక్షిణాసియాలోనే 100% మురుగుసింది చేసే నగరం లేదని వెల్లడించారు. మురుగునీటిది 100% శుద్ధి చేస్తున్నది ఒక్క హైదరాబాదులో నేనని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయంలోనే ఈ ఘనత సాధించామన్నారు. రూ.3,800 కోట్ల ఖర్చుతో ఎస్టీ పేల నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. నగరంలోని 54 నాలాల నుంచి మూసిలోకి మురికినీరు వస్తుందన్నారు. టిఆర్ఎస్ హయంలో నిర్మించిన ఎస్టిపిలను రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారని, హైదరాబాదులో 57.7 కిలోమీటర్లు మూసి ప్రవహిస్తుందని, మూషిపై 15 చోట్ల బ్రిడ్జిలను నిర్మించాలని ప్రణాళికలు తాము రూపొందించామన్నారు. చారిత్రక వారసత్వ సంపదనం కాపాడుతూ ఆధునికంగా నిర్మించాలని నిర్ణయించామన్నారు. బ్రిడ్జిల నిర్మాణానికి 545 కోట్లు మంజూరు చేశామన్నారు. రోడ్, బ్రిడ్జి, చెక్ డాం నిర్మించాలనుకున్నామని తెలిపారు. పదివేల కోట్లతో భారీ స్కై ఓవర్ నిర్మించాలనుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, బండారి లక్ష్మారెడ్డి, ముఠాగోపాల్, వివేకానంద, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, మాజీ కార్పొరేటర్ జిన్నారం విట్టల్ రెడ్డి, కొప్పుల విఠల్ రెడ్డి, జివి.సాగర్ రెడ్డి, భవాని ప్రవీణ్ కుమార్, చెరుకు ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్టిపిసిని పరిశీలిస్తున్న కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి

## నాలుగేళ్లలో 20లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే లక్ష్యం

-కుల మతాలు, పార్టీలకు అతీతంగా పేదలకు అందజేస్తాం
-మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్



లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందిస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేరాజాసింగ్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 19,ప్రభాతవార్త:**

రానున్న నాలుగేళ్లలో 20లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ ,హౌసింగ్, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈమేరకు శనివారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన గోషామహల్ నియోజకవర్గానికి చెందిన లబ్దిదారులకు డబుల్ రూం పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఇంచార్జ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ కులాలు,మతాలు, ప్రాంతాలు ,పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడమే తమ ప్రభుత్వ అశయమన్నారు. ఎలాంటి బేషజాలాలకు పోకుండా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సి న వాటా ,నిధులు అడిగి తీసకుంటామని ,పెద్దఎత్తున రాష్ట్రానికి ఇండ్లు మంజూరు చేయాలని హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర హౌసింగ్ జాయింట్ సెక్రటరీని కోరడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం పేదవాడి గురించి ఆలోచన చేయలేదని, పైన పటారం, లోపల లొటారం అన్నట్లు వ్యవహరించిందని విమర్శించారు. ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్‌గోల వల్ల మా ప్రభుత్వానికి వచ్చే నష్టమేమీ లేదని ,ఏడాది కూడా పూర్తికాకముందే తమ ప్రభుత్వంపై రోడ్డుకు ఎక్కడం బిఆర్ఎస్‌కే నష్టమన్నారు. పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో చేయలేనిది తమప్రభుత్వం 10నెలల్లో చేసి చూపిస్తుంటే ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని విమర్శించారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు ఒక మంచి జీవితాన్ని ఇవ్వాలనే ఉద్దేశ్యంతో తమ ప్రభుత్వం వారికి ఇండ్లు ,ఉద్యోగం, ఉపాధి కల్పిస్తే బిఆర్ఎస్ ఓర్వలేక పోతుందన్నారు. ఇంచార్జ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏకార్యక్రమం చేసినా ఇబ్బందిపెట్టే కుట్ర జరుగుతుందన్నారు. మూసీ పునర్జీవనంపై అనేక అభాండాలు వేస్తున్నారని బిఆర్ఎస్ బాధ్యతగల ప్రతిపక్షం అయితే నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గోషామహల్ నియోజకవర్గంలో 144మంది పేదలకు ఎవరి ప్రమేయం లేకుండా ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా పారదర్శకంగా డబుల్‌బెడ్‌రూం ఇండ్లు అందజేశామని ఇందులో 9మంది దివ్యాంగులకు గ్రౌండ్‌ఫ్లోర్ కేటాయించామన్నారు.

ఇండ్లలోనివారికి ఇప్పటికే త్రాగునీరు, లైటింగ్, డ్రైనేజీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాజాసింగ్, శ్రీగణేష్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, రమహత్‌బేగ్,అదనపు కలెక్టర్ వెంకటాచారి పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారులకు ప్రమోషన్‌లు కల్పించాలి

**-తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్**



ప్రసంగిస్తున్న తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్

**చిక్కడపల్లి, అక్టోబరు 19 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న వ్యవసాయ అధికారులకు సీనియార్టీ ప్రకారం ప్రమోషన్‌లు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో వ్యవసాయ అధికారుల సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైద్యనాథ్ మాట్లాడుతూ అన్ని కేడర్స్‌లో సీనియార్టీ ప్రకారం జాబితాను తయారు చేయాలని, ప్రతి వ్యవసాయ అధికారికి వాహనంతో పాటు ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అధికారులకు ఇతర సౌకర్యాలు కూడా కల్పించాలని కోరారు. వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీలు చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందలకు గురవుతున్నారని, వెంటనే బదిలీలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కృపాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శివధర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అనూరాధ, కోశాధికారి రవీందర్, మహిళా ఉపాధ్యక్షురాలు వీణారెడ్డి, ప్రచార కార్యదర్శి మానస తదితరులు పాల్గొన్నారు.

### జవహర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కార్పొరేటర్ తనిఖీ

**చిక్కడపల్లి, అక్టోబరు 19 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ శనివారం జవహర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్, ప్రిన్సిపాల్ దేవదాస్, అధ్యాపకులతో కలిసి పాఠశాలలో తరగతి గదులు, విద్యార్థులకు కల్పిస్తున్న భోజన వసతి, ఉపాధ్యాయుల కొరత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనం పంపిణీలో ఎటువంటి లోటుపాట్లున్నా తనదృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విద్యార్థులకు స్వయంగా భోజనాన్ని వడ్డించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల కొరతను భర్తీ చేసేందుకు ప్రభుత్వ అధికారులతో సమీక్షించిన తర్వాత నియామకం త్వరితగతిన అయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు.

## నేత్రపర్వం నర్తకి విశిష్ఠ నృత్యం

**నాంపల్లి, అక్టోబరు 19 ప్రభాతవార్త :** నృత్యోదయ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ అకాడమీ, ముంబయి నిర్వహణలో ప్రముఖ యువ నృత్యకారిణి విశిష్ఠ భరతనాట్య నృత్యార్పణం నేత్రపర్వం కావించింది. బ్రహ్మకుమారీస్ గ్లోబల్‌పీస్ ఆడిటోరియంలో శనివారం రాత్రి విశిష్ఠ చూడముచ్చటగా ఆంగికాభినయం, కరణాలతో ఉల్లాసం ఉత్సాహభరితంతో నృత్యప్రదర్శనతో కనులకింపు, అర్థవంతంగా నాట్యప్రియులను అలరించింది. ముందుగా శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన జీయర్‌స్వామిజీ జ్యోతిప్రకాసనంచేసి విశిష్ఠ డింగరి భరతనాట్య సోలో ప్రదర్శనను ప్రారంభించి శుభాశీస్సులందజేశారు. ముంబయికి చెందిన నాట్యగురు డా. జయశ్రీ రాజగోపాలన్ శిష్యురాలు విశిష్ట తన భరతనాట్య ప్రదర్శనను సంప్రదాయ నృత్యాంజలితో ప్రారంభించి, ప్రతీ అంశంలో తన నాట్యప్రతిభను చాటుకొని ప్రధానంగా వర్ణం అంశంలో కరహరప్రియ రాగంలో తెన్మాడ నరసింహాచారి రూపొందించిన రామాయణ ఘట్టాలను కళ్లకుకట్టినట్లు ప్రదర్శించినతీరు విచ్చేసిన అశేష ప్రేక్షకుల ప్రశంసలందుకుంది. అలాగే లీలాగోపాలన్ స్వరపరిచిన జతిస్వరం, పురందరదాసు కీర్తన దేవరనామ అంశాలతో ఆకట్టుకొనగా భూప్‌రాగంలో చోకమేళా రూపొందించిన అభంగ్ ప్రదర్శన ఈ నృత్యార్పణకే హైలైట్ కాగా చివరిగా అమృతవర్షిణి రాగంలో తిల్లానా అంశంతో ప్రదర్శనకు ముగించింది. గురు జయశ్రీ రాజగోపాలన్ నట్టువాంగం, వైష్ణవి ఆనంద్, ఐశ్వర్య హరీష్‌లు గాత్రం, ఆదిత్య రాజగోపాలన్ మృదంగం, బి.అనంతరామన్ వయోలిన్, కుమార్ కృష్ణన్ వేణువుతో వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. ప్రముఖ నాట్యగురు పద్మవిభూషణ్ డా. పద్మాసుబ్రహ్మణ్యం, కళారత్న అశోక్‌గుర్జాలేలు నృత్యకళాకారిణి విశిష్ఠను ఘనంగా సత్కరించి శుభాశీస్సులు అందజేశారు.

### నేడు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పర్యటన

**జీడిమెట్ల, అక్టోబర్ 19, ప్రభాతవార్త**

నేడు ఉదయం 10:30 గంటలకు కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ నందకా అడ్వాన్స్ సర్జరీ సెంటర్ ప్రారంభోత్సవానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా విభాగానికి చెందిన నాయకురాలు, అనుబంధ సంఘాల నాయకులు సభ్యులు, అభిమానులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కార్యాలయం నుండి తెలియజేశారు.

### ఆధార్ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న కిషన్ బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్

**మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబరు 19 ప్రభాతవార్త :** ఆధార్ కార్డులో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్ ప్రజలను కోరారు. కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కార్డు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని, ప్రజలు ఆధార్ కార్డు కేంద్రాన్ని అన్ని విధాల సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**సికింద్రాబాద్, అక్టోబర్ 19 ప్రభాతవార్తః**

నలభై అయిదు సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహన్ని చిలకలగూడ పోలీసులు గాంధీ ఆసుపత్రి మార్చురికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీ ఆసుపత్రి అవుట్ పెషెంట్ విభాగం ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండగా గుర్తించారు. మృతుడు పింక్ టీషర్ట్, క్రీం కలర్ ప్యాంటు ధరించాడు. సంబంధికులు ఎవరైన ఉంటే చిలకలగూడ పోలీసులను సంప్రదించాలని కోరారు.

### చికిత్స పొందుతూ...

తీవ్ర అనారోగ్యంతో దాదాపు 70 సంవత్సరాల వృద్ధుడు గాంధీ ఆసుపత్రి అవుట్ పెషెంట్ విభాగం ఎదురుగుగా ఇబ్బంది పడుతుండగా అక్కడే ఉన్నవారు ఈనెల 15న గాంధీ ఆసుపత్రి ఎమర్జెన్సీలో చేర్చారు. చికిత్స పొందుతూ 16 సాయంత్రం మృతి చెందాడు. మృతుడి కోసం ఎవరూ రాకపోవడంతో గాంధీ ఆసుపత్రి మార్చ్యూరీకి తరలించారు. మృతుడు బ్లూ కలర్ ప్యాంటు, వైట్ కలర్ గీతలతో కూడిన షర్ట్ దరించాడు. సంబంధికులు ఎవరైనా ఉంటే చిలకలగూడ పోలీసులను సంప్రదించాలని కోరారు.

# ప్రజా వాగ్గేయకారుడు సుద్దాల హనుమంతు

**-రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేశ్**

**-అరుణోదయ నాగన్నకు సుద్దాల హనుమంతు-జానకమ్మ జాతీయ పురస్కార ప్రదానం**



అరుణోదయ నాగన్నకు సుద్దాల హనుమంతు-జానకమ్మ జాతీయ పురస్కార ప్రదానం చేస్తున్న జస్టిస్ భీమపాక నగేశ్, చిత్రంలో సుద్దాల అశోక్‌తేజ తదితరులు

**చిక్కడపల్లి, అక్టోబరు 19 ప్రభాతవార్త:** ప్రజా వాగ్గేయకారుడు సుద్దాల హనుమంతు అని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేశ్ అన్నారు. శనివారం రాత్రి బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సుద్దాల హనుమంతు-జానకమ్మ కళాపీఠం, సుద్దాల ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అరుణోదయ నాగన్నకు సుద్దాల హనుమంతు-జానకమ్మ జాతీయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం సుద్దాల సుధాకర్ తేజ అధ్యక్షతన జరిగింది. జాతీయ కవి ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుద్దాల అశోక్‌తేజ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో పురస్కారాన్ని ప్రదానం చేసిన అనంతరం జస్టిస్ భీమపాక నగేశ్ మాట్లాడుతూ ప్రజాకవిగా, కవిగా, కళాకారుడిగా, అంతకుమించి క్రమశిక్షణ కలిగిన కమ్యునిస్టుగా జీవితమంతా కష్టజీవుల కోసం, కమ్యునిస్టు ఉద్యమం కోసం అంకితం చేసిన వ్యక్తి అని అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ కులోన్మాద, మతోన్మాద, రాజ్యోన్మాద శక్తులను దిక్కరించడానికి, ప్రజలను మేల్కొలపడానికి, ప్రజా వాగ్గేయకారుడు సుద్దాల హనుమంతు చేసిన కృషి నేటికి ప్రజలు మరిచిపోలేదని అన్నారు. తొలితరం ప్రజాకవి, తెలంగాణ సాయుధపోరాట యోధుడు సుద్దాల హనుమంతు అని అన్నారు. ప్రజాకవి సుద్దాల హనుమంతు జీవిత పర్యంతం పస్తులే ఆస్తిపాస్తులుగా నమ్మిన నిజమైన ప్రజాకవి అని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన గొప్ప కవి అని అన్నారు. దిక్కులు పిక్కటిల్లే ధిక్కార గళాన్ని అరుణోదయ నాగన్న అని అన్నారు. నాగన్న జాతీయ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు స్మారకోపన్యాసాన్ని డాక్టర్ పోరెడ్డి రంగయ్య నిర్వహించగా ఆత్మీయ అతిథులుగా యోచన, అందం వెంకటరెడ్డి, బి.బిక్షపతి బాల్యస్నేహితులను తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ బాలోత్సవం పిల్లలచే చక్కటి సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమం సమన్వయకర్త, ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎన్.సోమయ్య, ఉపాధ్యక్షురాలు కె.సుజావతి, జి.బుచ్చిరెడ్డి స్మారకోపన్యాసాన్ని నిర్వహిస్తారన్నారు.

# పాడిపంటలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది

**-ప్రభుత్వానికి మీకు మధ్య వారధిగా ఉంటాను**

**-గోపాలమిత్రల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం**

**-రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



ప్రసంగిస్తున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**చిక్కడపల్లి, అక్టోబరు 19 ప్రభాతవార్త:** పాడి పంట బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, గోపాలమిత్రల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లి ఆర్టీసి కళాభవన్‌లో తెలంగాణ రాష్ట్ర గోపాలమిత్రల సంఘం ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆత్మీయ సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గోపాలమిత్రలు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. గోపాలమిత్రకు గౌరవ వేతనం పెరగడం, ఫేజ్‌లవారీగా వెటర్నరీ డాక్టర్ సహాయకులుగా నియామకాలు అయ్యేలా చూస్తానని, గోపాలమిత్రలు వెటర్నరీలు వేరు కాదు, హుస్నాబాద్‌లో తప్ప మిగిలిన అన్ని చోట్ల పాల ఉత్పత్తులు కల్తీ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాల్సిన చిన్న వయస్సు నుండే పాలలో కల్తీ వల్ల అనారోగ్యబారిన పడుతున్నారని, కల్తీ నిరోధించబడి ఆరోగ్య తెలంగాణగా రూపుదిద్దుకోవాలని, సమృద్ధిగా పాల ఉత్పత్తి జరిగినప్పుడే కల్తీని నిరోధించవచ్చన్నారు. రాష్ట్రంలో 12700 గ్రామ పంచాయితీలలో పాల ఉత్పత్తి వేగంగా జరగాలని, మన సమస్యలకు మార్గాన్ని కూడా మనమే పరిష్కారమయ్యేలా చూసుకుందామన్నారు. నవంబరు మొదటివారంలో సిఎం వద్దకు తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో మల్లీశ్వరి, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఎంవి.రెడ్డి, వెటర్నరీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌బాబు, ఇతర అధికారులు, గోపాలమిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాటమయ్య కిట్లు ధరించండి...రక్షణ పొందండి

**-ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**-గీతాకార్మికులకు కిట్లు పంపిణీ**



**అత్తాపూర్ అక్టోబరు19,ప్రభాతవార్త :** గీతా కార్మికులు తప్పకుండా కాటమయ్య కిట్లు ధరించి ప్రాణాలను కాపాడుకొని రక్షణ పొందాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం రాజేంద్రనగర్ సర్కిల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో గౌడ కులస్తులకు కాటమయ్య కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి శిక్షణ పొందిన 20 మంది గీతా కార్మికులకు కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....రాష్ట్రంలో గౌడ కులస్తుల కోసం గత ప్రభుత్వం ప్రస్తుత ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డి గౌడ కులస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారి ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో గీతా కార్మికులకు కాటమయ్య కిట్లు తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఐఐటి విద్యార్థులు తయారీ చేసిన ఈ కిట్లను ఎక్సైజ్ శాఖ ప్రత్యేక చొరవ తీసుకొని గౌడస్తులకు అందించడం అభినందనీయమని అన్నారు. ఈ కాటమయ్య కిట్టు అనేది గౌడ అన్నకు రక్షణగా ఉంటుందని 1000కిలోల బరువును మోస్తుందని అన్నారు. రాబోయే రోజులలో రాష్ట్ర గౌడస్తులకు కాటమయ్య కిట్లతో పాటు మరిన్ని పథకాలను తీసుకురానుందని అన్నారు. గౌడన్నలు ఎవ్వరూ కూడా ప్రమాదకరంగా చెట్లు ఎక్కి తమ ప్రాణాలను పోగొట్టుకోవద్దని వారు తప్పకుండా కాటమయ్య కిట్ల వాడి రక్షణ పొందాలని సూచించారు. అదేవిధంగా గౌడ కులస్తులు ఈత మొక్కలను పెంచుకోవాలని దాని ద్వారా మనకు ఉపాధి అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని లేకుంటే మన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ప్రభుత్వం కూడా ఈత చెట్లు నాటేందుకు సన్నాహాలు చేస్తుందని అన్నారు. ఎక్సైజ్ శాఖ వారు ప్రత్యేక చొరవ తీసుకొని గౌడస్తులకు కాటమయ్య కిట్లు అందించడం అభినందనీయమని వారు ఎల్లప్పుడు గీతాకార్మికులకు అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు శ్రీనివాస్, రాష్ట్ర గౌడ సంఘం జనరల్ సెక్రెటరీ హరిచరణ్, నార్సింగ్ మార్కెట్ కమిటీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ ప్రేమ్ దాస్ గౌడ్, స్థానిక గౌడ సంఘం నాయకులు సుధాకర్ గౌడ్, కృష్ణయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం : నార్త్‌జోన్ డిసిపి

**కంటోన్మెంట్, అక్టోబర్ 19 ప్రభాతవార్తః** కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంలోని అమ్మవారి విగ్రహం ధ్వంసం కేసులో పోలీసుల తరపున సీరియస్‌గా దర్యాప్తు చేస్తున్నట్లు నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ తెలిపారు. ఈ కేసులో ఒక నిందితుడు పాల్గొన్నాడని, అతను ప్రస్తుతం హాస్పిటల్‌లో ట్రీట్మెంట్‌లో ఉన్నాడని, ట్రీట్మెంట్ అనంతరం కస్టడీ తీసుకొని విచారిస్తామని తెలిపారు. నిందితుడిపై చట్టపరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. నిందితుడు ఉన్న హోటల్ సీజ్ చేసినట్లు డీసీపీ వివరించారు. నిందితుడు ఉన్న హోటల్‌లో ఎంతమంది ఉన్నారు, ఎందుకు ఉన్నారు, ఏమి చేశారు అనే దానిపై పోలీసుల విచారణ కొనసాగుతుందని డీసీపీ పేర్కొన్నారు. శనివారం హిందు సంఘాలు ఇచ్చిన పిలుపు సాఫీగానే సాగినా టెంపుల్ వద్ద శృతిమించడంతో దానిని కంట్రోల్ చేశామన్నారు.

### అమాయకులపై లాఠీ చార్జీ పోలీసు వ్యవస్థకు సిగ్గుచేటు

**- కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్**

హిందువులు ప్రశాంత వాతావరణంలో ఆలయం ధ్వంసం విషయంలో ఆందోళన జరుపుతుంటే పోలీసులు ఎలాంటి కారణం లేకుండా లాఠీ చార్జి జరుపడం విచారకరమని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. ముత్యాలమ్మ ఆయలం వద్ద జరిగిన లాఠీ చార్జిలో గాయపడ్డ వారిని ఆయన శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేయడం హిందువులు మనోభావాలను దెబ్బతీసిందర్నారు. పోలీసులు కుడా విచక్షణ రహితంగా కాళ్లమీద కొడుతున్నారా... తలల మీద కొడుతున్నారా.. అని చూసుకోకుండా పోలీసులు రాక్షసుల్లా ప్రవర్తించారన్నారు. పోలీసులు దర్మార్గమైన చర్యలకు పాల్పడ్డారని, ఇది పోలీసు వ్యవస్థకే సిగ్గుచేటన్నారు. నగరంలో 150 మంది ప్రత్యేకంగా వచ్చి కొందరికి నెలరోజుల పాటు క్లాసులు తీసుకొని రెచ్చగొట్టే విధంగా వ్యవరిస్తే పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. వచ్చిన వారు ఎందుకు వచ్చారు. ఏ దేశస్తులు అనే విషయం తెలుసుకోకుండా అమాయకంగా ఉన్న హిందువులపై లాఠీ చార్జి చేసిన పోలీసులు వ్యవహించాల్సిన విధానం కాదన్నారు. ఈ విషయంలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### మియాపూర్ హైవేపై కారు దగ్ధం-స్థంబించిన ట్రాఫిక్

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 19 ప్రభాతవార్త**

మియాపూర్ మెట్రోస్టేషన్ వద్ద అగ్నిప్రమాదం సంబవించింది. కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మంటలు ఎగసిపడటంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది. మంటలను అదుపుచేశారు. కారు పూర్తిగా దగ్ధమైంది. ముంబై, హైదరాబాద్ హైవేపై ఈ ప్రమాదం జరగటంతో భారీగా ట్రాఫిక్ స్థంబించింది. మియాపూర్ నుంచి కూకట్‌పల్లి జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేరకు వాహనాల రాకపోకలు నిలిచిపోయారు కారులో అగ్నిప్రమాదం సంబవించిటానికి కారణాలపై పోలీసులు ఆరాతీస్తున్నారు. నిత్యం జనభాతో రద్దీగా ఉండే జాతీయ రహదారిపై కారు దగ్ధమవడం, ఎవరికీ ఏలాంటి ప్రాణనష్టం జరకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

### అంబేద్కర్ అభయహస్తం నిధులను వెంటనే విడుదల చేయాలి

**- తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రౌండ్‌టేబుల్ సమావేశం**

**చిక్కడపల్లి, అక్టోబరు 19 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్ అభయహస్తం పేరుతో స్వయం ఉపాధి రంగాలకు రూ.17వేలకోట్ల నిధులను కేటాయించారు కాని నిధులు విడుదల చేయలేదని తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం(టిఎంఎస్ఎస్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు గడ్డ యాదయ్య విమర్శించారు. శనివారం బాగ్‌లిగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'అంబేద్కర్ అభయ హస్తం పథకం' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బంధ్‌సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లెల వీరస్వామి, మాదిగ రాజ్యాధికార పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బిఎన్.రమేశ్‌మాదిగ, మాలమాదిగల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఏకు తిరుపతి, మాదిగ మేధావుల ఫోరం ప్రొఫెసర్ నతనియేలు, మహా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ముత్యపాగ నరసింహారావు, తెలంగాణ దండోరా గౌరవ అధ్యక్షుడు దొమ్మాట శివకుమార్, తెలంగాణ దండోరా విద్యార్థి విభాగం స్టేట్ కోఆర్డినేటర్ మీసాల ఎల్లేష్, జిల్లా అధ్యక్షుడు గువ్వల లక్ష్మణ్, టిఎంఎస్ఎస్ కార్యదర్శి రెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు రూ.33,124,04కోట్ల నిధులను కేటాయించారని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా నిధులను దారిమళిస్తోందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కంటే కూడా రెండు లక్షలు ఎక్కువగా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఒక్కో కుటుంబానికి రూ.12లక్షల చొప్పున అంబేద్కర్ అభయహస్తం పేరుతో పథకాన్ని ప్రకటించిందని, నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సిఎం రేవంత్‌రెడ్డి స్పందించి అంబేద్కర్ అభయహస్తం పథకం కింద నిధులను విడుదల చేయాలని, ఎంపిక చేసిన లబ్దిదారులకు న్యాయం చేయాలని అన్నారు.

### దేవతా విగ్రహాలపై దాడులకు నిరసనగా ధర్నా

**ఘట్‌కేసర్, అక్టోబర్ 19, ప్రభాతవార్త:** హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని విశ్వహిందూపరిషత్ ఉప్పల్ జిల్లా ఉపాధ్యక్షులు పసులాది చంద్రశేఖర్‌ముదిరాజ్ డిమాండ్ చేశారు. భాగ్యనగరంలో ముత్యాలమ్మ ఆలయంలో దేవత విగ్రహం మీద దాడి, తెలంగాణ వ్యాప్తంగా హిందూ ఆలయాలపై జరుగుతున్న వరసుదాడులకు నిరసనగా ఘట్‌కేసర్‌లో శనివారం మహాధర్నా నిర్వహించారు. విశ్వహిందూపరిషత్ ఉప్పల్ జిల్లా అధ్యక్షులు రమేశ్‌నాయుడు, ఉపాధ్యక్షులు పసులాది చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహించి నినాదాలు చేస్తూ రహదారిపై ధర్నా చేశారు. హిందూ దేవత మూర్తులను ధ్వంసం చేయడం దారుణమని, ప్రభుత్వం నిందితులకు కఠిన శిక్షలు వేసేలా చర్యలు తీసుకొని తిరిగి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో భజరంగ్‌దళ్ అధ్యక్షులు పెద్దబోయిన అరవింద్, ఉపాధ్యక్షులు మహేందర్, సంయోజక కార్యదర్శి శ్రీనివాస్‌చారీ, విహెచ్‌పీ సంయోజక్ సదానంద్, ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, గణేశ్, గోరక్షక్ తదితరులు పాల్గొన్నారు.

### బ్యాంకు క్రాప్‌లోన్ ఇవ్వకుండా రైతును తోసివేసినకోట్‌పల్లి యూనియన్ బ్యాంకు మేనేజర్

**కోట్‌పల్లి, అక్టోబరు 19 ప్రభాతవార్త :** కోట్‌పల్లి మండల పరిధిలోని కరింపూర్ గ్రామానికి చెందిన సుందరి బందయ్య తండ్రి సాయన్న రైతు శనివారం నాడు కోట్‌పల్లి యూనియన్ బ్యాంకులో క్రాప్‌లోన్ రూ,2,20000,అమౌంట్ కట్టడం జరిగిందని మేము కట్టిన అమౌంట్ దాని కంటే రూ,20000, తక్కువ రాయడం జరిగిందని ఇలా ఎందుకు రాసినావు అని బ్యాంకు మేనేజర్‌కు అడగడానికి వెళ్తే నువ్వు ఎవ్వరికి చెప్పుకుంటావో చెప్పుకో కలెక్టర్ చెప్పుతావో చెప్పుకో అని పాసుబుక్‌లు విసిరి వేయడం జరిగిందని రైతు బందయ్య మీడియా ముందకు వచ్చి అవేదన వ్యక్తం చేశారు. నా బార్యకు కుడా క్రాప్‌లోన్ రూ ,2,21900లు కడితేరూ,160000,వేలు రాయడం జరిగిందని అన్నారు. నాకు పక్షవాతం వచ్చిందని నేను కష్టం చేసే పరిస్థితి కుడా లేదని క్రాప్‌లోన్ కోసం అప్పుచేసి కడితే ఇలా తక్కువ అమౌంట్ రాస్తే నేను ఎలా బత కాలి అని తీవ్రంగా అవేదన వ్యక్తం చేశారు. గతంలో కుడా డ్వాక్రా మహిళ సంఘాల మహిళలు కుడా బ్యాంకుకు వెళ్తే బ్యాంకు మేనేజర్ ఇష్టానుసారంగా వ్యవరించడం జరిగిందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి నాకు న్యాయం చేయాలని రైతు కోరుతున్నారు.

### మాలల చైతన్య సభను విజయవంతం చేయాలి

**-మాల మహానడు జిల్లా అధ్యక్షులు వెంకటేశం**

**కొడంగల్, అక్టోబర్ 19ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అద్వర్యంలో నిర్వహిస్తున్న మాలల చైతన్య సభను విజయవంతం చేయాలని మాల మహానాడు వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం. వెంకటేశం పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి అద్వర్యంలో అక్టోబర్14న మాలల చైతన్య బస్సు యాత్ర హైద్రాబాద్ నుంచి నల్గొండ, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామా బాద్, సంగారెడ్డి జిల్లాల మీదుగా మహబుబ్‌నగర్ జిల్లా కేంద్రానికి ఈనెల 22న చేరుకుంటుందన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర చైర్మేన్ జి.చెన్నయ్య, కోచైర్మేన్‌లు ఎత్తపుకేశవులు, చెరుకు రామచందర్, కరణం కిషన్, తాళ్ళపల్లి రవి, నల్లాల కనకరాజు, బూర్గుల వెంకటేశ్వర్లు, గోసాజు రమేష్ తదితరులు మహబుబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వస్తున్న సందర్భంగా ఉమ్మడి మహబుబ్‌నగర్ జిల్లాలోని వివిధ మాల సంఘాల నాయకులు, మాలలు పెద్ద ఎత్తున హజరై విజయవంతం చేయాలని కోరారు. మాలల చైతన్య బస్సుయాత్ర ద్వారామాలల్లో చైతన్యం చేయడానికి టీఎన్జీవోలో సభ నిర్వహిస్తునట్లు తెలిపారు.

### ప్రైవేట్‌కు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**పాఠశాల ఉపాధ్యాయుడు అశోక్‌మౌర్య**



ప్యాడ్, నోట్‌బుక్స్, పెన్నులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

**షాబాద్, అక్టోబర్ 19, ప్రభాతవార్త :** ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేసి ఉత్తమ ఫలితాలుసాధించాలని పాఠశాల ఉపాధ్యాయుడు అశోక్‌మౌర్య అన్నారు. మండల పరిధిలోని మన్మర్రి ప్రాథమిక పాఠశాలకు సూర్పి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శశిప్రకాష్ విద్యార్థులకు ఎగ్జామ్స్ ప్యాడ్, నోటుబుక్స్, పెన్నులు తదితర వస్తువ్రలను అందజేశారు. ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించి పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాలన్నారు.ు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ఉపాధ్యాయులు వెంకటమ్మ, గ్రామస్థులు ఉన్నారు.

## మధుసూదన్‌రెడ్డికి శుభాకాంక్షలు



**షాబాద్, అక్టోబర్ 19, ప్రభాతవార్త :** ఇటీవలే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని శనివారం షాబాద్ ముదిరాజ్ సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు నగరంలో ఆయన నివాసంలో కలిసి చైర్మెన్‌గా ఎన్నికవ్వడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.... ముదిరాజ్‌ల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చైర్మెన్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కావలి చంద్రశేఖర్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు లింగం, గౌరవ అధ్యక్షులు వెంకటయ్య, కార్యదర్శి మానయ్య, నాయకులు జనార్దన్, శ్రీనివాస్, గౌరీశ్వర్, మల్లేష్, వెంకటయ్య, చంద్రయ్య, యాదగిరి, ఆనందం, రవి ఉన్నారు.

### ఘట్‌కేసర్ విద్యుత్ ఏఈగా బలరాంనాయక్

**-పదోన్నతిపై సతీష్‌కుమార్ బదిలీ**



సతీష్‌కుమార్‌నుసన్మానిస్తున్న నాయకులు

**ఘట్‌కేసర్, అక్టోబర్ 19, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ విద్యుత్ ఏఈగా బలరాంనాయక్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏఇగా రెండు సంవత్సరాల (ఆగష్టు 2022)కు పైగా విధులు నిర్వహించిన సతీష్‌కుమార్‌కు ఏడిఈగా పదోన్నతిపై లభించింది. సూర్యాపేట్ విద్యుత్ ఏడిఈగా సతీష్‌కుమార్ పదోన్నతిపై బదిలీ అయ్యారు. బోయినపల్లి సీబీడీ నుంచి బలరాంనాయక్ ఘట్‌కేసర్ ఏఇగా బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా ప్రమోషన్‌పై వెళ్తున్న ఏడిఈ సతీష్‌కుమార్, కొత్తగా వచ్చిన ఏఈ బలరాంనాయక్‌లను ఘట్‌కేసర్ మున్సిపల్ ఇడబ్ల్యుఎస్‌కాలనీ నాయకులు శాలువాతో సన్మానించారు. కాలనీ అధ్యక్షులు కేశవపట్నం అంజనేయులు, కార్యదర్శి పి.శశిధరణ్, మున్సిపల్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ, గోరకంటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**కొండపాక, అక్టోబర్ 19, ప్రభాతవార్త** కొండపాక గ్రామానికి చెందిన అకుల బాగ్య శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, అనంతుల ప్రశాంత్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కొక్కరు రూ॥ 10 వేల అర్థిక సహాయం అందించారు.

## రైతు కమిషన్ చైర్మన్‌గా కోదండ రెడ్డిని నియమంచడం అభినందనీయం : కోట్ల శ్రీనివాస్



రైతు కమిషన్ చైర్మన్‌గా నియమితులైన కోదండ రెడ్డికి పుష్పగుచ్ఛాలను అందజేస్తున్న కోట్ల శ్రీనివాస్ తదితరులు

**మలక్‌పేట అక్టోబరు19,ప్రభాతవార్త :** రైతు కమిషన్ చైర్మన్‌గా కోదండ రెడ్డిని నియమించడం అభినందనీయని టిపిసిసి ప్రధాన కార్యదరినశ సిహెచ్ బాలరాజ్,కార్యదర్శులు కోట్ల శ్రీనివాస్,మామిడి కృష్ణ కుమార్‌లు పేర్కొన్నారు.రైతు కమిషన్ చైర్మన్‌గా నియమితులైన కోదండ రెడ్డిని వారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిసి సెల్ స్టేట్ కన్వీనర్ పృథ్వీరాజ్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాల పోచయ్య,శ్రీనివాస్ ,తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలి



సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం అక్టోబరు19,ప్రభాతవార్త :** బిఎన్ రెడ్డి నగర్ డివిజన్ లోని బిఎన్ రెడ్డి నగర్ ఫేస్ 1 జరుగుతున్న ఓపెన్ జీమ్ పనులను, విజయపురి కాలనీ ఫేస్ 1లో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణపు పనులను స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి శనివారం పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలన్నారు.ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేల పార్కులను తీర్చిదిద్దుతున్నామన్నారు.యువకులు క్రీడల్లో రాణించాలన్నారు.

## మాలల ఆత్మగౌరవం సభ




**తుర్కయంజాల్ అక్టోబరు19,ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీ పిలుపుమేరకు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి తుర్కయంజాల్ మాల మహానాడు కమిటీ సారథ్యంలో అంబేద్కర్ చౌరస్తాలో మాలల ఆత్మగౌరవ సభ వాల్ పోస్టర్ రిలీజ్ చేశారు.ఈ యొక్క సమావేశానికి అతిథిగా రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కో చైర్మన్ గద్ద శ్రీనివాస్,తుర్కయంజాల్ మాజీ సర్పంచ్ చెవుల దశరథ,జై బీమ్ యువజన సంఘం,మాజీ అధ్యక్షుడు నల్లవెల్లి వెంకటేష్ ,చక్రపాణి,తావుల శ్రీనాథ్,చెవుల నరేందర్, సల్వాది యాదగిరి ,సల్వాది రమేష్,మద్దెల కృష్ణ,కామల రామస్వామి ,నీరెడ్డి రాజు,సుందరయ్య,టీచర్,రాము,రేనాన్ స్మార్ట్ సాయి గౌరవ్,బల్ రామ్,వినోద్,భాను ప్రసాద్,లక్ష్మయ్య,కృష్ణయ్య,కృష్ణ చైతన్య,తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలీకి తరలివెళ్లిన బిజెపి నేతలు



**మల్కాజిగిరి అక్టోబరు19,ప్రభాతవార్త :** సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ దేవాలయంపై ముష్కరుల దాడికి నిరసన విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి గుడి వద్ద నుండి ముత్యాలమ్మ దేవాలయం వరకు చెపట్టిన భారీ ర్యాలీలో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.ఈసందర్భంగా హిందువులపై హిందూ దేవాలయాలపై దాడులను ఆపలేని ఈ ఖాన్‌ల ప్రభుత్వం హిందూ యువకులపై చేసిన లాఠీ చార్జ్‌లో అనేక మంది హిందూ యువకులు గాయపడ్డారు.మాపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పోలీసుల అత్యుత్సాహమే ఈ పరిస్థితికి కారణమని రేవంత్ ఖాన్ ఈడాదులకు జవాబు చెప్పలని డిమాడ్ చేశారు.

## బాలాపూర్ కాలనీల్లో సిసి రోడ్లకు శ్రీకారం



రోడ్డు పనులు ప్రారంభించిన మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ శేఖర్

**సరూర్‌నగర్, అక్టోబర్ 19 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 15వ డివిజన్ బాలాపూర్ పద్మావతి కాలనీ, సీతా ఎమెన్యూ కాలనీల్లో ప్రజల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేస్తున్న రోడ్డు నిర్మాణపు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి డిప్యూటీ మేయర్, స్థానిక కార్పొరేటర్ అయిన ఇబ్రాం శేఖర్‌తో కలిసి రోడ్డు నిర్మాణపు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బందారి మనోహర్, నాయకులు ఎర్ర జైహింద్, అఫ్జల్, మహ్మద్, స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనంతుల సురేందర్ రెడ్డి, మాలిపెద్ది అంబరీష్‌రెడ్డి, కిష్టారెడ్డి, పేట వెంకటేష్ శనివారం మర్యాదా పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

## హిందూ ఆలయాలు, దేవతా విగ్రహాలపై దాడులు సహించం : అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, అక్టోబర్ 19 ప్రభాతవార్త:** హిందూ ఆలయాలు, దేవతా విగ్రహాలపై దాడులను సహించమనీ ఈ దురాగాతాలపై రాజకీయాలకతీతంగా పోరాడాలని తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని జల్‌పల్లి శ్రీరామ కాలనీలోనున్న పోచమ్మ ఆలయంలో జరిగిన మహా హారతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులు, స్థానికులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా హారతినిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాలు, విగ్రహాలపై దాడులను ఖండిస్తూ హిందువుల ఐక్యత చాటడానికే ఈ మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు. గత కొన్ని నెలలుగా మతోన్మాదులు ఆలయాలపై కక్ష కట్టి విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారనీ ఇది మంచి పద్ధతి కాదని ఆయన హెచ్చరించారు. రక్షాపురం, మైలార్‌దేవ్‌పల్లి, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో జరిగిన ఉదంతాలు హిందువులను మనస్థాపానికి గురి చేశాయని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ దుస్సంఘటనలను మతాలకతీతంగా, రాజకీయాలకతీతంగా అందరూ ఖండించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌గౌడ్, మనోజ్‌కుమార్, మల్లేష్, సంతోష్, హరికృష్ణ, సుమిత్, గణేష్, శ్రీనివాస్, నాగార్జున, ఆకాశ్, మహేందర్, శివ, షేర్ సింగ్, పెద్ద సంఖ్యలో మహిళలు, పాల్గొన్నారు.



మహా హారతినిస్తున్న మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్

## 21న శ్రీ బీరప్ప స్వామి, కామరాతిదేవిల కళ్యాణ మహోత్సవం

**సరూర్‌నగర్, అక్టోబర్ 19 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్‌లో పునర్నిర్మించిన శ్రీ బీరప్ప స్వామి ఆలయంలో ఈ నెల 21వ తేదీన సోమవారం బీరప్ప స్వామి కామరాతిదేవి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. గ్రామానికి చెందిన కురుమలు పురాతన బీరప్ప స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసే నిమిత్తం పాత ఆలయ స్థానంలో భవ్యమైన ఆలయాన్ని నిర్మించారు. ఈ నేపథ్యంలో 16వ తేదీ నుండి విగ్రహ ప్రతిష్టాపనోత్సవ పూజలను ప్రారంభించారు. ఇందులో భాగంగా గత బుధవారం పునర్నిర్మించిన ఆలయంలో బీరప్ప స్వామి, కామరాతిదేవి వి గ్రహాలతో పాటు మహంకాళి, బుగ్గ పోచమ్మ దేవతా మూర్తుల ప్రతిష్టాపనోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయితే ఈ నెల 21వ తేదీ సోమవారం ఉదయం 11.45 నిమిషాలకు బీరప్ప స్వామి, కామరాతిదేవి కళ్యాణోత్సవాన్ని జరపాలని నిర్ణయించారు. కళ్యాణోత్సవాలను పురస్కరించుకొని శనివారం సాయంత్రం స్వామి వారి పుట్ట కప్పుట, గంగా స్నానం జరిపారు. ఆదివారం ఉదయం ఒడక లగ్నం, కొట్నం, సాయంత్రం బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఆ మరుసటి రోజు సోమవారం భక్తుల సమక్షంలో కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. కళ్యాణం అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు బలి కార్యక్రమం తర్వాత అన్నప్రసాద వితరణ జరుపుతారు. ఈ కళ్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని బడంగ్‌పేట్ గ్రామ పెద్ద కురుమ గౌర సత్యనారాయణ కురుమ, సెలువోజి దొడ్డి మల్లికార్జున కురుమలతో పాటు గ్రామ కురుమ సంఘం నాయకులు, కురుమ పెద్దలు కోరారు. కళ్యాణోత్సం మరుసటి రోజు మంగళవారం మధ్యాహ్నం శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవి, సిరియాల గౌరమ్మ పరశురాములు వేషధారణలతో ఎల్లమ్మ ఒగ్గు కథ, బుధవారం మధ్యాహ్నం మహంకాళి దేవి, బీరప్ప స్వామి, కామరాతిదేవి, భోగన్న వేషధారణలతో ఒగ్గు కథ, రాగవెల్లి హారతి నిర్వహిస్తారు.

అనంతరం గురువారం ఉదయం గొర్ర కళ్యాణం, గొర్లకు సల్లతాపుట, తొక్కుడు మైలలు తీయుటతో ఉత్సవాలు ముగుస్తాయి.



బడంగ్‌పేట్‌లో పునర్నిర్మించి బీరప్ప స్వామి ఆలయం

## అవార్డులు సమాజానికి సేవ చేయాలనే ఆకాంక్షను పెంపొందిస్తాయి : అంజనీ కుమారి

**మలక్‌పేట్ అక్టోబరు19,ప్రభాతవార్త :** అవార్డులు సమాజ విలువలను కాపాడుతూ సమాజానికి సేవ చేయాలనే ఆకాంక్షను పెంపొందిస్తాయని తెలంగాణ రాష్ట్ర సిఎస్సి కోర్టు సూపరింటెండెంట్ అంజని కుమారి పేర్కొన్నారు.ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్,ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రిస్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన డాక్టర్ అక్కినేని నాగేశ్వర రావు శత జయంతి వేడుకలను పురస్కరించుకొని ప్రతిష్టాత్మకమైన నట సామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వర రావు అవార్డును అంజనీ కుమారికి నిర్వాహకులు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...సినీ రంగానికి చెందిన డాక్టర్ అక్కినేని నాగేశ్వర రావు ,రామారావులు దేశానికి ఆదర్శవంతమైన పురుషులుగా వెలిగొందారని,వారిని ఆనాటి తరం నుంచి ఈనాటి తరం వరకు ప్రతి నటుడు ఆదర్శంగా తీసుకుంటున్నారంటే వారికి వృత్తిపట్ల గౌరవం, అంకితభావం,సమాజాన్ని తీర్చిదిద్దడంలో వాళ్ల యొక్క కృషి,క్రమశిక్షణ,సమాజాన్ని చైతన్య పరచడంలో వారి దీక్ష ఎప్పటికి మర్చిపోలేమన్నారు.విలువలతో కూడిన జీవనాన్ని గడిపి ఎందరికో ఆదర్శ మూర్తులుగా నిలిచారన్నారు.వారిని ఆదర్శంగా తీసుకుని ఇందిరా ఫౌండేషన్ నిర్వాహకులు ఇందిరా,ఆలూరి విల్సన్‌లు అనేక కార్యక్రమాలు చేస్తూ కొత్తగా వచ్చిన యువతకు ప్లాట్ ఫామ్‌లను ఏర్పాటు చేసి వారిలోని ప్రతిభను వెలికి తీయడానికి కృషి చేస్తున్నారని వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో పటేల్ రమేష్ రెడ్డి,లయన్ డాక్టర్ అరిగేపూడి విజయ్ కుమార్,నాగన్న గౌడ్, సోమన్న ,గణేషన,త్రివక్రమ రావు,రామకృష్ణ, చంద్ర మౌళి,గొట్టిపర్తి శ్రీనివాస్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.




ఆంజని కుమారికి నట సామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వర రావు అవార్డును అందజేస్తున్న నిర్వాహకులు

## సమస్యల తీవ్రతను బట్టి నిధులు కేటాయించి అభివృద్ధి పనులను పూర్తిచేస్తాం : ఎమ్మెల్యే

**హయత్‌నగర్, అక్టోబరు 19 ప్రభాతవార్త:** సమస్యల తీవ్రతను బట్టి నిధులను కేటాయించి ప్రణాళిక బద్ధంగా నియోజకవర్గంలోని మున్సిపాలిటీలు, గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ తట్టిఅన్నారం గ్రామపరిధిలోని ఇందుఅరణ్య కాలనీలో ఆయన శనివారం మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ పందుగుల జయశ్రీరాజుతో కలిసి పర్యటించి కాలనీవాసుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దశల వారిగా సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తున్నామని అందులో భాగంగా ప్రజా సమస్యలను గుర్తించి అత్యవసరమైన పనులను ముందుగా చేపట్టి వాటిని పరిష్కరిస్తున్నామని వివరించారు. మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ సమస్య ప్రధానంగా ఉందని, ఇప్పటికే పెద్దఅంబర్‌పేటతో పాటు తట్టిఅన్నారంలో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పెద్దఅంబర్‌పేటలో ట్రంక్‌లైన్ పనులు కొనసాగుతుండగా... తట్టిఅన్నారంలో డ్రైనేజీ పనులపై సర్వేకొనసాగుతోందన్నారు. డ్రైనేజీ అనంతరం తాగునీరు, రోడ్లు, వీధిదీపాల వంటి సమస్యలను పరి ష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు దేవిడి గీత, సిద్ధంకి కృష్ణారెడ్డి, పసుల రాజేందర్, హరిశంకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

### నాచారం వెంకటేశ్వర స్వామి బ్రహోత్సవాల్లో ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి

**నాచారం, అక్టోబర్ 19 ప్రభాతవార్త:** నాచారం హెచ్‌ఎంటీనగం లోని శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గం ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డా. దుర్గప్రసాద్, వెంకటేశ్వర్లు, గోపాల్ రెడ్డి, శేషరెడ్డి, లక్ష్మిరాజ్యం,అప్పారావు, రాంబాబు, మహంకాళి ఆలయ చైర్మన్ కృష్ణారెడ్డి, డివిజన్ అద్యక్షులు శ్రీకాంత్ గౌడ్, రాజి రెడ్డి, రాంరెడ్డి, అశ్వత్థామ రెడ్డి, రమేష్ గౌడ్, హెచ్‌ఆర్.మోహన్, మెత్కు శ్రీనివాస్ రెడ్డి, బందారి,రఘు, నూతులకంటి రాజు, నెమలి కొండ సునీల్ రెడ్డి, క్రాంతి, రవి యాదవ్, ఉమ, నర్సింగ్ రావు, శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.



నాచారం వెంకటేశ్వర స్వామి బ్రహోత్సవాల్లో పాల్గొన్న మందముల పరమేశ్వర్‌రెడ్డి

### నాచారంలో పెండింగ్ బ్రిడ్జీ పనులను వెంటనే ప్రారంభించాలి : కార్పోరేటర్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పోరేటర్ సాయిజన్ శేఖర్ అధికారులు

**నాచారం, అక్టోబర్ 19 ప్రభాతవార్త:** నాచారంలో పెండింగ్‌లో ఉన్న రెండు బ్రిడ్జీ పనులను వెంటనే ప్రారంభించాలని కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ ఈఈగా ఇటివల వచ్చిన నాగేందర్, డిఈ రూప, ఏఈ ప్రవంతిలతో కలిసి కార్పోరేటర్ సాయిజన్ శేకర్ డివిజన్‌లో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద భవాని నగర్ ప్రధాన రోడ్డులో పాత బ్రిడ్జీ స్థానంలో రూ. 94 లక్షలు మంజూరైన పనులను, పోచమ్మ దేవాలయం వద్ద రూ. 54లక్షల వ్యయంతో మంజూరైన నూతన బ్రిడ్జీ పనులను కూడా వెంటనే ప్రారంభించాలని ఈఈకి కార్పోరేటర్ వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శాయిజన్ శేఖర్, విఠల్ యాదవ్, రామకృష్ణ, మధుసూధన్ రెడ్డి, కట్టబుచ్చన్న గౌడ్, సుగుణాకర్ రావు, కిష్టయ్య, గణేష్, నర్సింగ్‌రావు, సుధాకర్, హరిప్రసాద్, వర్క్ ఇన్స్‌పెక్టర్ విజయ్ కుమార్ తధితరులు పాల్గొన్నారు.

## దేవాలయ కమిటీ కార్యవర్గ సభ్యులకు సత్కారం



ఆలయ కమిటీ ఛైర్మన్, సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్న జైపాల్‌రెడ్డి

**హయత్‌నగర్, అక్టోబరు 19 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి కుత్బుల్లాపూర్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ భూనీల సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కొంద్ర ఏలమయ్య, ఆలయ కమిటీ డైరెక్టర్లను శనివారం కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి శాలువాతో సన్మానించి కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత



పసుమాములో రెవెన్యూ అధికారులు కూల్చివేసిన షెడ్డు

**హయత్‌నగర్, అక్టోబరు 19 ప్రభాతవార్త:** ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను ఆక్రమిస్తే ఊరుకునేది లేదని అబ్దుల్లాపూర్‌మెట్ తహశీల్దార్ సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం గ్రామం తట్టిఖాన సర్వే నెంబరు 26లో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాన్ని రెవెన్యూ సిబ్బంది శనివారం కూల్చివేశారు. దీంతో పాటు పసుమాముల గ్రామం సర్వేనెంబరు 422లో అక్రమంగా వేసిన షెడ్డును సైతం జేసీబీతో కూల్చివేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ... ప్రభుత్వ భూములను ఆక్రమించి చేపట్టే నిర్మాణాలపై చర్యలు తప్పవని ఒకసారి కూల్చివేసినా నిర్మాణదారులు వాటిని మళ్లీ కొనసాగిస్తే క్రిమినల్ చర్యలు చేపడతామని హెచ్చరించారు.

### సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మంచి స్పందన:పవన్



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి, పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 19 ప్రభాతవార్త:** బిజెపి సభ్యత నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేష్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం రివ్యూ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి, స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై నాయకులు కార్యకర్తలకు దిశనిర్దేశం చేశారు. డివిజన్ పరిధిలోని సభ్యత్వం వివరాలు అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### నవంబర్ 5న ఛలో ఖమ్మం రాష్ట్ర స్థాయి గిరిజన సమ్మేళనం



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 19 ప్రభాతవార్త:** ప్రజాఉద్యమాల సారథి గుగులోత్ ధర్మానాయక్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్ యన్‌టిఆర్‌నగర్ బంజారాబస్తీలో నవంబర్ 5,6వ తేదీన ఖమ్మంలో జరిగే గిరిజన సంఘం రాష్ట్ర సమ్మేళనంను విజయవంతం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడవత్ ధర్మానాయక్, రాష్ట్ర కమటి సబ్యులు యం. గోపినాయక్‌లు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని శనివారం వారు ఎన్టీఆర్‌నగర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో పెరిగిన గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కే.సోమ్లానాయక్, యన్.ఈశ్వర్‌నాయక్, ఆర్.పవన్ నాయక్, కే.సాయినాయక్, సింధు, ప్రియ, బాలమణి పాల్గొన్నారు.

## అవసరమైన చోట నూతన రోడ్ల నిర్మాణం : కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, అక్టోబరు 19 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలో అవసరమైన చోట్ల నూతన రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి అన్నారు. లక్ష్మినగర్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభించిన అనంతరంన కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో కనీస సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం, గోపి, శ్రీను, శంకర్, వెంకటయ్య, కిషన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## హోటల్స్, లాడ్జిల నిర్వాహకులతో సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డిసిపి కాంతిలాల్ సుభాష్

**సైదాబాద్, అక్టోబరు 19 ప్రభాతవార్త:** సౌత్ ఈస్ట్ జోన్ పరిధిలోని లాడ్జిలు, హోటల్స్ నిర్వాహకులతో డిసిపి కాంతిలాల్ సుభాష్ శనివారం సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ చట్ట పరిధికి లోబడి లాడ్జిలు, హోటల్స్ నిర్వహించుకోవాలని సూచించారు. పబ్లిక్ సేఫ్టీ, ట్రేడ్ లైసెన్స్ నిబంధనలు, బిఎన్‌ఎస్‌ఎస్ గురించి వివరించారు. విజిటర్స్ వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేసి వాటిని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలకు క్రమం తప్పకుండా అందజేయాలని సూచించారు. లాడ్జిలలో ఉండే వారి గుర్తింపు కార్డులు భద్ర పర్చాలని, సిసిటివిలు తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని, ఏదైనా వాణిజ్య పరమైన ఈవెంట్ జరిగినప్పుడు స్థానిక పోలీసులకు తెలియజేయాలని సూచించారు. గేమింగ్, వ్యభిచారం, డ్రగ్స్ వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే శిక్ష తప్పదని హెచ్చరించారు. డిఎఫ్‌ఎండి, హెచ్‌హెచ్‌ఎండి, సెక్యూరిటి గార్డులు, తగినన్ని భద్రతా పరికరాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి టి.స్వామి, ఎసిపిలు, ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయంలో అర్ధరాత్రి చోరీకి యత్నం.. నిందితుడి అరెస్టు

**సరూర్‌నగర్, అక్టోబర్ 19 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని గ్రామ దేవత పోచమ్మ ఆలయంలో చోరీకి ప్రయత్నించిన ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేసి కేసును నమోదు చేశారు. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్‌పెక్టర్ కీసర నాగరాజు కథనం ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత బడంగ్‌పేట్‌లోని చిన్న పోచమ్మ ఆలయంలో లెనిన్‌నగర్‌కు చెందిన బోర్‌వెల్ కార్మికుడు జె.కుమార్ (25) చోరీ చేయడానికి ప్రయత్నిస్తుండగా గమనించిన వారు 100కు డయల్ చేసి విషయం చెప్పారు. దీంతో సమాచారం అందుకున్న మీర్‌పేట్ పెట్రోలింగ్ పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకొని ఆలయంలో హుండీ డబ్బులను అపహరించడానికి యత్నిస్తున్న కుమార్‌ను అదుపులోకి స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు నిందితునిపై కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**ఆలయానికి ఎలాండి డామేజ్ జరగలేదు: ఇన్స్‌పెక్టర్ నాగరాజు**

బడంగ్‌పేట్ చిన్న పోచమ్మ ఆలయానికి సంబంధించి ఎలాంటి డామేజీ గానీ, శిఖరం ధ్వంసం గానీ జరగలేదని ఇన్స్‌పెక్టర్ కీసర నాగరాజు స్పష్టం చేశారు. శిఖరం ధ్వంసం జరిగినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఆయన తెలిపారు. చోరీకి ప్రయత్నించిన నిందితుడు కుమార్‌పై గతంలో ఇనుము (స్క్రాప్) దొంగతనం కేసులు ఉన్నాయని ఆయన వెల్లడించారు. నిందితుడు చేసే చోరీ ప్రయత్నంలో హుండీ ఓపెన్ కాలేదనీ ఈ నేపథ్యంలో నగదు గానీ, ఇతర వస్తువులు గానీ అపహరణ జరగలేదని ఆయన తెలిపారు.